# 'రేపటి బాల్యం'

-కేశిరాజు ఫణిప్రసాద్

ఆదివారం మధ్యాహ్నం భోజనం పూర్తయింది!

ఆరోజు పేపరులో విశేషాలు చదువుతూ కూర్చున్నాను. వంటింట్లో పనులు చేసుకుంటోంది మా ఆవిడ సుచరిత.

ఆనాటి పేపరులో స్పెషలు ఎడిషన్ తీరుబడిగా చదవటం నాకున్న అలవాటు. మెయిన్ పేపరులో వార్తలు ఒక్క వాక్యం చదివితే చాలు.

లోపల గదిలో మా అమ్మాయి స్రవంతి, అబ్బాయి అనూప్ కూర్చొని టివి చూస్తున్నారు. ప్రశాంతంగా ఉంది వాతావరణం.

వంటింట్లో పనయిపోయిందనుకుంటూ మా ఆవిడ కూడా పిల్లల దగ్గర కూర్చుని టి.వి. చూస్తోంది. పేపరు చదువుతూ ఇంట్లో వాళ్ళ గురించి ఇలా పట్టించుకోవటానికి ఒక కారణం ఉంది.

టివిలో ఒకే ఛానల్ అందరూ కలిసి చూడటం చాలా అరుదుగా జరుగుతుంది. మిగతా వాళ్ళ ఇళ్ళల్లో జరిగే తంతు కూడా ఇదే! కాని మా ఇంట్లో సర్దుకుపోవటం ఏమాత్రం జరగదు. ఈరోజు "నేను ఆ ఛానల్ చూస్తాను", "అదేం కుదరదు నేను హిందీ సినిమా చూడాలి" అని వాదనలు లేవు. రోజూ ఉండే ఘర్షణలు ఏమయినట్టు?

ఆశ్చర్యాన్ని లోపలే అణుచుకుని దృష్టి పేపరులో ఉన్న ఆర్టికల్ మీద పెట్టాను. పేపరు చదివాక ప్రత్యేక శీర్షికలు చూస్తున్నాను.

"నాన్నా నాన్నా" అంటూ మా అమ్మాయి నా దగ్గర కొచ్చింది. పైగా నా పక్కన సర్దుకుని మరీ కూర్చుంది.

"ఏమిటి విషయం" పేపరుని చూస్తూ అడిగాను.

"ఇవాళ మధ్యాహ్నం సినిమాకి వెళ్ళాలి" ఖచ్చితంగా అంది మా అమ్మాయి.

"అయితే నేనేం చెయ్యాలి" మామూలుగా అన్నాను.

"పిల్లలు సినిమాకెళితే వాళ్ళ నాన్నగారు డబ్బులిస్తారు" తడుముకోకుండా మాట్లాడింది.

"ఏయ్ మొద్దూ మనం చూడవలసిన సినిమా నెలకి ఒక్కసారే! ఆదివారం వచ్చినప్పుడల్లా మధ్యాహ్నం మేట్నీ ప్రోగ్రాం ఉండకూడదు" గదిలోంచి దూసుకుంటూ వచ్చి మరీ చెప్పాడు మా సుపుత్రుడు.

వెంటనే "ఈ విషయం తమకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మాకూ తెలుసు" నీకు నేను అక్కను అనే అర్థం వ్యక్తంచేస్తూ మాట్లాడింది.

"మరే తెలిసి కూడా ఇలా అడుక్కోవటమెందుకు?" మాటకి మరో మాట విసిరాడు మా అబ్బాయి.

"విషయం పూర్తికాకముందే మధ్యలో మాట్లాడితే అనుమానం వస్తుంది, ఆ తరువాత తెలివితక్కువతనం బయటపడుతుంది" స్రవంతి మాటకి జవాబు చెప్పకుండా ఉండిపోయాడు వాడు.

"సరే ఉన్న విషయం పూర్తిగా చెప్పు" చదువుతున్న పేపరు పక్కకు పడేసి మా అమ్మాయిని అడిగాను.

"ఇవ్వాళ మనందరం కలిసి సినిమాకెళ్ళాలి. నువ్వు తప్పకుండా మాతో రావాలి" మా అమ్మాయి మాటల్లో పట్టుదల.

కుటుంబంతో కలిసి సినిమాకి వెళ్ళడం నాకు అలవాటులేదు. అంతేకాదు, సినిమా హాల్లో కూర్చుని సినిమా చూడటం నాకిష్టముండదు. ఆ వాతావరణం నాకు నచ్చదు.

నిజం చెప్పాలంటే సినిమా హాలుకెళ్ళి సినిమా చూడటం మానేసి సుమారు పది సంవత్సరాలు అయి ఉంటుంది. ఎప్పుడూ ఏదో ఒక కారణం చెప్పి మా ఆవిడని, పిల్లల్ని పంపిస్తూంటాను.

ఇవ్వాళ కూడా నాలో అదే ఆలోచన. మాట్లాడకుండా ఉండిపోయాను.

"చూడండి మీతో కలిసి సినిమాకెళ్ళాలని పిల్లలెన్నాళ్ళ నుంచో సరదా పడుతూ అడుగుతున్నారు. కనీసం ఇవ్వాళయినా వాళ్ళమాట ఒప్పుకుని వాళ్ళ ముచ్చట తీర్చండి". సుచరిత కూడా కల్పించుకుని మరీ మాట్లాడింది. అదీ మామూలుగా కాదు ఆ మాటల్లో అభ్యర్థన.

ఏమీ మాట్లాడకుండా కూర్చున్న నన్ను "నాన్నా, ఏదో వంక చెప్పేసి తప్పించుకుందామనుకుంటున్నావేమో. ఇవ్వాళ అది నీ వల్ల కాదు" ఈసారి మరింత గట్టిగా మాట్లాడాడు మా అబ్బాయి.

కాని నా ఆలోచన వేరు. నా ఉద్దేశం వేరు.

సినిమా హాలు కెళ్ళటానికి ఖర్చు, టికెట్ల ఖర్చు కలిపితే ఎంతవుతుంది. సినిమాకెళ్ళాక ఇంటర్వెల్లో ఊరికే ఉండలేం కదా. ఏదో ఒకటి తినాలి. ఎవరి

కిష్టమైనది వాళ్ళు త్రాగాలి. అదొక ఖర్చు. సినిమా చూశాక మన ఇంటి ప్రాంతంలోకి వచ్చే ఆటోవాడిని మీటరు మీద రానంటే బ్రతిమాలి, వాళ్ళు ఒప్పుకోకపోతే మనమైనా ఒప్పుకోక తప్పదు.

వీటన్నింటిని తలుచుకుంటూ కూర్చున్నాను. ఈ ఖర్చుని గురించిన ఆలోచన మనసుని బరువు మొయ్యగలవా అంటూ నిలదీస్తోంది.

"ఇదిగో నాన్నా, ఇవ్వాళ నువ్వు సినిమాకి మాతో రాకపోతే జరిగేదేమిటో తెలుసా?" నిక్కచ్చిగా మాట్లా డుతున్న మా అమ్మాయి వైపు చూశాను.

"మేము కూడా సినిమాలు చూడటం మానుకుం టాం. మన కుటుంబం కలిసి మరింక ఎక్కడికీ వెళ్ళటం వీలుపడనిది అనుకుంటాం". మా అబ్బాయి నిర్మొహ మాటంగా చెప్పేశాడు. మా ఆవిడ, మా అమ్మాయి అదే అర్థం వ్యక్తం చేస్తూ నన్నే చూస్తున్నారు.

"హలో మిత్రమా, ఈ రోజు నీ పిల్లలు నీతో మాట్లాడినట్టుగా నువ్వు ఎప్పుడైనా మీ నాన్నతో మాట్లాడగలిగావా, అంతెందుకూ అసలు మీ నాన్న నీతో ఇలా కలుపుగోలుగా ఉండేవాడా?"

నా బాల్యం నన్ను సూటిగా ప్రశ్నిస్తోంది.

## 'అమృతం'

దేవతలు మాత్రమే తాగింది
రాక్షసుల మదిలో కోరికగా మిగిలింది
దొంగతనంగా తాగిన నేరానికి
ఇద్దరి తలలు వేరైనాయి
ఆ తలలు కక్ష తీర్చుకునేందుకు
సూర్యచంద్రులే పావులైనయ్

ఏ పాపం చేశామని
మన పాలిట ఈ నేతలు
తీరని వాళ్ళ అవినీతి ఆకళ్ళు
ఆకలి తీరని నేతల
చేతిలో పావులు
ఈ అమాయక ప్రజలు

రాక్షసులకు ఆ కసి
అవినీతి నేతలకు ఈ ఆకలి
వాళ్ళు చచ్చేదాకా
తీరనే తీరదు

**-మధుమతి ఎం.వి.**

వెంటనే నా చిన్నతనం నా కళ్ళముందు కదిలింది. చిన్నప్పుడు ఏ రోజయినా నువ్వు సరదాగా ఉన్నావా? నువ్వు సంతోషంగా గడిపిన జ్ఞాపకాలెన్ని? నిజమైన బాల్యమంటూ నువ్వు చూడగలిగావా? ఇన్ని మాట లెందుకు ఒక్క విషయం ఆలోచించు. నీకన్నీ చేదు అనుభవాలే. ఒక బొమ్మల కథలాంటి బాల్యం నీకు వ్యధతోనే గడిచిపోయింది. ఆటపాటలలో ఉండాల్సిన వయసులో వయసుని మర్చిపోయి పనులు చేసి మరీ బ్రతికావు. ఇదంతా ఎవరి వల్ల? మీ నాన్న వల్లేగా. మరిప్పుడు ఒక నాన్నగా నువ్వు పిల్లలతో ఎలా ఉండ దలుచుకున్నావు?

అంతే, మరుక్షణం పెళ్ళాం పిల్లలతో సినిమాకి బయల్దేరాను.

రాత్రి పదిగంటలు. ఆఫీసు నుంచి ఆలస్యంగా వచ్చాను. స్నానం చేసి రాగానే భోజనానికి కూర్చు న్నాను.

అన్నం తింటూ మా ఆవిడ సుచరిత చెపుతున్న కబుర్లు మధ్య మధ్య వింటున్నాను. "అన్నట్టు మీతో ఒక ముఖ్య విషయం చెప్పాలి" అన్న మా ఆవిడ మాటకి ఏమిటన్నట్టు చూశాను.

"మనందరం కలిసి సినిమాకి వెళ్ళాం జ్ఞాపక ముందిగా. మన పిల్లలు ఈ మధ్య వాళ్ళ స్నేహితులతో ప్రత్యేకించి మరీ చెప్పారు."

"ఇది జరిగి పదిహేను రోజులయింది. ఇందులో వాళ్ళ ఫ్రెండ్స్‌తో కలిసి చెప్పుకోవటమెందుకు?" యథా లాపంగా అన్నాను.

"మొదట నేనూ మీలాగే అనుకున్నాను. కాని మన పిల్లలిద్దరూ అందులో ఒక థ్రిల్ ఉందమ్మా. ఈ మాటలకి మా ఫ్రెండ్సందరూ ఎంతో సంతోషించారు" అని చెప్పి మురిసిపోతున్నారు. సుచరిత కూడా ఉత్సా హంగా చెప్పింది.

మా ఆవిడ చెప్పిన మాటలు వినగానే అనుకోని ఆనందం నాలోనూ కలిగింది. నిజమే సినిమా కెళ్ళు తున్నప్పుడు మా వాళ్ళలో కలిగిన ఉత్సాహం, వాళ్ళ కళ్ళలో తళుక్కుమనటం నా కళ్ళముందు కదులుతూనే ఉంది.

కాని హఠాత్తుగా మరో విషయం గుర్తుకొచ్చింది. అంతే, మరుక్షణం మనసు చిన్నబోయింది. ఆ రోజు ఖర్చుపెట్టిన డబ్బు మళ్ళీ సర్దుబాటు చేసుకోవటానికి నేనెంతో కష్టపడ్డాను. ఇది నా ఒక్కడికే తెలుసు.

భోజనం పూర్తిచేసి బయటికొచ్చి వాకిట్లో కుర్చీలో

కూర్చున్నాను. ఒక్కసారి కుటుంబంతో కలిసి సినిమా కెడితే అయిన ఖర్చు గురించి నాలో మర్చిపోనివ్వని ఆలోచన.

"పెళ్ళాం పిల్లలతో కలిసి సినిమాకి ఎంతమంది వెళ్ళడంలేదు. ఇదేదో నీకొచ్చిన కష్టమనుకుంటావేమిటి?" హృదయం దెప్పిపొడిచింది. వెంటనే "మోసేవాడికి కావిడి బరువు తెలుస్తుంది" డబ్బు సర్దుబాటు కావటానికి అదేపనిగా మధనపడిన మనసు చెప్పిన సమాధానం!

"జీవితం అంటే కష్టసుఖాల కలయిక. ఆటుపోట్లకి తట్టుకోవటమే తెలివైన లక్షణం. అక్కడికేదో దోపిడి జరిగినట్టుగా బాధపడటం ఎంతవరకూ సమంజసం. అయినా నీవాళ్ళకి నువ్వు అందించిన మర్చిపోలేని సంతోషం విలువ తెలుసుకో" వివేకం మనసుని హెచ్చరించింది.

"నువ్వు నీ జీవితం, పెళ్ళాం, పిల్లలు, సుఖసంతోషాల కోసం, నీ వాళ్ళకోసం ఏమి చెయ్యాలన్నా సంకోచించకు. మనస్ఫూర్తిగా చెయ్యి. అటువంటి క్షణాలు ఎంత మధురమో నువ్వే తెలుసుకుంటావు" వివేకం అందిస్తున్న ప్రోత్సాహం.

"మరో సంగతి! నువ్వు హైస్కూల్లో చదువుకోవటానికి మీ నాన్నతో మీ అమ్మ ఎంతగా పోట్లాడిందో గుర్తు చేసుకో" గత జీవితపు అనుభవం తలంపుకొచ్చింది. వెంటనే కర్తవ్యం కూడా బోధపడింది.

ఒక తండ్రిగా నా పిల్లల సుఖ సంతోషాలే నాకు ముఖ్యం.

కాలం గడుస్తోంది. మామూలుగా కాదు.. అనుక్షణం నన్ను హెచ్చరిస్తూ గడుస్తోంది.

మా అమ్మాయి, మా అబ్బాయి పోటీలు పడి మరీ చదివారు. స్కూలులో అందరికంటే ఎక్కువ మార్కులతో పాసయ్యారు.

మెరిట్‌లో వచ్చినందుకు ఇద్దరి ఫోటోలు పేపర్లో వేశారు. అదే సందర్భంలో స్కూలు ప్రిన్సిపల్ మా ఇంటికి వచ్చి నన్ను మా ఆవిడను ఎంతగానో ప్రశంసించారు. తల్లిదండ్రులుగా ఇవి మర్చిపోలేని క్షణాలు. మా అమ్మాయి, అబ్బాయి స్నేహితులతో కలిసి ఎవరెవరు ఏ కాలేజీలో చేరాలో తర్జన భర్జనలు పడుతున్నారు. ప్రతిరోజూ పేపరులో వస్తున్న కాలేజీ ప్రకటనల గురించి మాట్లాడుకుంటున్నారు.

ఈనాటి కాలేజీ నిర్వాహకులు ప్రకటనలివ్వటంలో ఒకరితో మరొకరు పోటీపడుతున్నారు. ఎవరి స్థోమతను బట్టి వాళ్ళు ప్రచారం జోరుగా సాగిస్తున్నారు. ఈ రోజుల్లో విద్యా సంస్థల్లో పలుకుల తల్లి కొలువుతీరిందో లేదో చెప్పటం కష్టం. కాని ఐశ్వర్యలక్ష్మి మాత్రం నిర్వాహకుల ఆశల్లో స్థిరంగా కూర్చుంది. సాయంత్రం ఆఫీసు నుంచి త్వరగా వచ్చాను. ఇంట్లో అడుగుపెట్టగానే ముందు గదిలో ఎవరో ఇద్దరు కూర్చుని ఉన్నారు. ఎవరో వీళ్ళు అనుకుంటూ లోపలి కెళ్ళగానే వాళ్ళిద్దరూ లేచి నాకు నమస్కారం చేసి వాళ్ళని పరిచయం చేసుకున్నారు.

ఊళ్ళో వాళ్ళ కాలేజీకి ఎంతో మంచి పేరుంది. అటువంటి కాలేజీ నిర్వాహకులు మా ఇంటికొచ్చారు. పైగా ఇంటి అడ్రసు కనుక్కుని మరీ వచ్చారు.

"మీ అమ్మాయిని, అబ్బాయిని మా కాలేజీలో చేర్పించాలి" అంటూ వాళ్ళ కాలేజీ గురించి వివరాలన్నీ

## అలలు

పడి లేచే అలను ఆదర్శం చేసుకో
అణగారిన బలాన్ని రాజేసుకో
అందరూ ఆ... భళా
అనే స్థాయికి చేరుకో.

## చదువు

తెలివికి కొలమానం చదువు కాదు
చదువుకు కొలమానము తెలివి.
చదువు రాదని తేలిక చేయకు
తెలివికి చదువుతో చేయూతనివ్వు

## మతం

మనుష్యుల్ని వేరు చేసి
చూపేది కాదు మతం
మనసుల్ని ఏకీకృతం
చేసేది మతం

## పండగ

పరవశంగా పట్టు పీతాంబరాలపై
తొణికిస లాడేదే కాదు పండగ
ఆత్మీయంగా అందర్నీ అక్కున
చేర్చుకొని ఆనందాన్ని
పంచుకునేదే పండగ.

–డా॥ జరీనా బేగం

చెప్పారు. వాళ్ళ మాటల్లో అతిశయోక్తి ఎంతమాత్రం ధ్వనించలేదు. "సరే మా పిల్లలతో కూడా మాట్లాడి మీకు చెపుతాను" అని అన్నాను. వెంటనే మా పిల్లల కొచ్చిన మార్కులు నాకు చూపించారు.

నేను రావటానికి ముందే పిల్లలిద్దరితోనూ మాట్లాడారు. ఒక్కక్షణం లోపలికి చూశాను. పిల్లలిద్దరూ నావైపే చూస్తున్నారు. నా అభిప్రాయం కూడా తెలుసు కుని వచ్చినవాళ్ళు వెళ్ళిపోయారు.

ఏమీ మాట్లాడకుండా నా పనులన్నీ పూర్తిచేసు కున్నాను. అలవాటు ప్రకారం పేపరు చదువుతూ కూర్చున్నాను. "పిల్లల్ని కాలేజీలో చేర్పించటం గురించి ఏమని ఆలోచించారు? "పడుకోవడానికి తప్ప ఇంకా ఏమీ ఆలోచించలేదు"

నా జవాబుకి మా ఆవిడ "అమ్మాయి, అబ్బాయి కొచ్చిన మార్కులు తెలుసుకుని మరీ వచ్చారు. పైగా మంచి కాలేజీ. పిల్లలు కూడా ఆ కాలేజీలోనే చేరాలని ఆశపడుతున్నారు."

సుచరిత చెప్పటం పూర్తిచేసి గదిలోకి వెళ్ళి పోయింది.

స్కూలు ప్రిన్సిపల్ ప్రశంసలు, పిల్లల్లో ఉత్సాహం, మా ఆవిడ చెప్పిన అభిప్రాయం, ఒకదాని తర్వాత ఒకటి మనసులో మెదులుతున్నాయి.

ఆలోచిస్తున్నాను. పిల్లల కోరిక ప్రకారం చెయ్య గలనా? అంచనా వేసుకుంటున్నాను.

ఎంత ఆలోచిస్తున్నా పిల్లల్ని వాళ్ళు ఇష్టపడే కాలేజీ లో చేర్పించటానికి ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాను.

ఎందుకు? ఆర్థిక బలహీనత! మిగతా తల్లిదం డ్రులు కూడా ఈ స్థితిలో నాలాగే అనుకుంటూంటారా? ఏమో? ఎలా తెలుస్తుంది?

ఆఫీసులోనూ, ఇంట్లోనూ ఇదే ఆలోచన. ఏం చెయ్యాలో తోచని పరిస్థితి. అలాగని ఊరకే ఉండ గలనా? పిల్లల మీద వాత్సల్యం క్షణక్షణం నన్ను పరీక్షి స్తూనే ఉంది.

ఆరోజు ఆదివారం. అయినా ప్రొద్దుటే లేచాను. అరుగుమీద కూర్చున్నాను. "ఏమండీ మీతో మాట్లాడాలి" అంటూ కాఫీ గ్లాసు అందిస్తూ చెప్పింది సుచరిత.

"పిల్లలు నిద్రలేచారా?" అడుగుతూ లోపలికొచ్చి కూర్చున్నాను.

"మిగతా పిల్లలందరూ వాళ్ళ ఇష్టమొచ్చిన కాలేజీల్లో చేరిపోతున్నారు. మన అబ్బాయి, అమ్మాయి తోటివాళ్ళని చూస్తూ వాళ్ళలో వాళ్ళే బాధపడుతున్నారు" సుచరిత మాటల్లో నా మీద నిష్టూరం.

"మన పిల్లలు నీతో చెప్పుకుంటూ బాధపడు తున్నారా? చటుక్కున అడిగాను.

"ప్రత్యేకంగా చెప్పించుకోవాలా? కన్నతల్లిగా వాళ్ళని చూస్తూంటే అర్థం చేసుకోలేనా?" విషయం ఎటూ తేల్చలేని నా పరిస్థితిని దెప్పిపొడుస్తూ అంటున్న అర్ధాంగిని నిశ్శబ్దంగా చూశాను.

"ఇప్పటికే ఆలస్యమైపోతోందన్న ఆలోచనతోనే మీరూ ఉన్నారని నేను అర్థం చేసుకోగలను" తన మాటతీరును సర్దుకుంటూ మాట్లాడింది సుచరిత.

"మౌనం కూడా ఒక్కొక్క సందర్భంలో అపార్థాలకు అవకాశమిస్తుంది. ఇప్పటికైనా నీ ఆలోచనేమిటో నీ భార్యతో చెప్పు" అంతరాత్మ హితవు.

"చూడు సుచరితా, పిల్లలిద్దరూ చురుకైనవాళ్ళు. అది మనం ప్రత్యేకంగా అనుకోనక్కర్లేదు. కాని అదే కాలేజీలో వాళ్ళని చదివించడానికయ్యే డబ్బు సర్దుబాటు గురించే..." నా మాట పూర్తి కానివ్వలేదు.

"మీరన్నమాటలోనే మార్గం కూడా ఉంది. అది గ్రహించలేకపోతున్నారు. కాలేజీలో వాళ్ళకయ్యే ఖర్చు పూర్తిగా మనమే భరించాలని ఎందుకు అనుకోవడం. చదువులు ప్రారంభమయ్యాక మెరిట్ స్కాలర్‌షిప్పులు

## దీపావళ్లులు

కన్నె పిల్ల కళ్ళలో ఆశాజ్యోతుల్లా
నవ వధువు ఎదురు చూపుల్లా
పెద్ద ముత్తైదువు దయార్ద్ర దృక్కుల్లా
వెలుగుతున్నాయి దీపాల వరుసలు
నాడు నరకాసురుడు సంహరింపబడ్డాడన్నారు
ఇంటింటా పండగ చేసుకున్నారు
నేడూ ఎందరెందరో నరకాసురులు పుడుతూనే
వున్నారు
అజ్ఞానాంధకారంలో ఎదుగుతూనే వున్నారు
విజ్ఞాన జ్యోతులతో సంహరింపబడుతూనే
వున్నారు
జగత్తు నిండా ఆనందపు దీపవళ్లులు వెలుగు
తూనే వున్నాయి
ప్రజలంతా ఆనందపు దీపావళులు చేసుకుం
టూనే వున్నారు.

**-జి. యల్. కామేశ్వరి**

సంపాదించుకునే సమర్థత మన పిల్లలకుందిగా?"

ఇంతవరకూ ఈ ఆలోచన నాకెందుకు రాలేదు అనుకుంటూ నన్నూ, నా అసమర్థతను లోలోపలే నిందించుకున్నాను.

"ఏమంటారు? నా మాటకి ఒప్పుకుంటారా?" ఆలోచించటంలో తనకున్న సమయస్ఫూర్తిని వ్యక్తం చేసింది సుచరిత.

"నా మాట విని ఆఫీసులో లోన్ తీసుకోండి. సంతోషంగా పిల్లల్ని కాలేజీలో చేర్పించండి" చెప్పటం పూర్తవగానే లోపలి కెళ్ళిపోయింది.

"ఒరేయ్ శ్రీరామ్, పెళ్ళయ్యాక పిల్లలు పుట్టడం వరకు మనకోసం మనం బ్రతకాలి. అటు తరువాత మనం పిల్లల ప్రగతి కోసం బ్రతకాలి."

నా ఆప్తమిత్రుడు విశ్వనాథ్ ఒక సందర్భంలో, అన్నమాటలు అనుకోకుండా జ్ఞాపకమొచ్చాయి.

నేటి పిల్లలు పూలమొక్కల్లాంటి వాళ్ళు. చక్కగా పెంచితే వాళ్ళే మన వాకిట్లో పూలతోటలు. తేలికపడ్డ మనసులో స్ఫురిస్తున్న కర్తవ్యం.

"ఏమిటండి, మీరు ఇవ్వాళ ఆఫీసులో లేరా?"

ఆఫీసు నుంచి రాగానే నాకెదురొచ్చి మరీ అడిగింది సుచరిత. వెంటనే "అవును నాన్నగారూ మధ్యాహ్నం నుంచి ఆఫీసుకి ఎన్నిసార్లు ఫోను చేసినా మీరు లేరనే చెప్పారు" అనూప్ కూడా అన్నాడు.

"సరే విషయమేమిటో చెప్పండి" వాళ్ళ ఆరాటానికి కారణం తెలుసుకోవాలని అడిగాను.

"ఒరేయ్ తమ్ముడూ, నువ్వుండు నాన్నగారికి నేను చెపుతాను" స్రవంతి హుషారుగా ముందుకొచ్చింది.

"నాన్నగారూ, ఈరోజు నుంచి తమ్ముడు ఒక పెద్ద కంపెనీకి ఫైనాన్షియల్ డైరెక్టర్" అంటూ కవరు నా చేతికిచ్చింది. అందులో లెటర్ తీసుకుని చదివాను. ఫారెన్ కొలాబరేషన్.. పెద్ద కంపెనీలో ఉద్యోగం. అపాయింట్‌మెంట్ ఆర్డర్ నాకు తెలియకుండానే మళ్ళీ మళ్ళీ చదివాను.

అంతే, మా అనూప్‌ని అమాంతం గట్టిగా కౌగలించుకున్నాను. అది మామూలు క్షణం కాదు. పుత్రోత్సాహంతో కళ్ళు చెమ్మగిల్లుతున్న అపురూపమైన క్షణం.

"ఇప్పటికైనా అర్థమైందా, వాళ్ళు మన పిల్లలండి" మా ఆవిడ స్వీటు ప్లేటుతో వస్తూ అంది. అర్థాంగి మాటల్లో ఒకపక్క గర్వం, మరోపక్క వాళ్ళ సామర్థ్యం మీద విశ్వాసం కలుపుగోలుగా వ్యక్తమవుతున్నాయి.

నిజాన్ని ఒప్పుకుంటున్నట్టుగా తలాడించాను. స్వీటు తింటూ పిల్లలిద్దరినీ చూస్తుంటే నా హృదయంలో మాటల కందని సంతోషం. ఎంతో కష్టపడి పెంచుకున్న మొక్కలకు పూసిన మొదటి పువ్వుల్లా ఉన్నారు నా పిల్లలు. కూతురుని ఇంజనీరింగ్ చదివించటానికి, కొడుకుని బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివించటానికి నేను పడిన కష్టాలన్నింటిని మర్చిపోతున్న సందర్భం.

అనూప్ ఉద్యోగంలో చేరాడు. ఆఫీసు వాళ్ళు ప్రత్యేకంగా మావాడి కోసం ఇచ్చిన కారులో వాడు ఆఫీసు కెళుతూంటే, ఆ హోదా, ఆ దర్జా ఎన్నిసార్లు చూసినా మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తోంది.

మరి నేను? మా నాన్న కాలం నాటి పాత సైకిలు మీద రోజూ ఆఫీసుకి వెడుతున్నాను. "మరేం ఫరవాలేదు. నిన్ను నువ్వు చిన్నబుచ్చుకోకు. నీ పిల్లల్ని చూస్తుంటే ఎంతో తృప్తిగా లేదూ?" వెన్నెల్లో స్నానం చేస్తున్న అంతరాత్మ నవ్వుతూ అడిగింది. అవును సుమా అని నేనూ నవ్వాను.

మా పిల్లల హోదా, అంతస్థు నన్ను ఎంతో ప్రభావితం చేస్తున్నాయి.

"శ్రీరామ్‌గారూ, మీరు గుమాస్తా ఉద్యోగం చేస్తున్నా, పిల్లలకి మంచి చెడులు ఆలోచించి మరీ చదివించారు. ఈరోజు వాళ్ళకున్న గౌరవం, గుర్తింపు చూస్తుంటే మీలాగా చెయ్యటం మా వల్ల అవుతుందా అని మాలో మేము అనుకుంటుంటాం" ఆఫీసులో తోటి ఉద్యోగుల ప్రశంసలు.

సవ్యమైన ఆలోచన, సందర్భోచితమైన ఆచరణ. కాలం ప్రతిరోజూ ఒక పండగలా గడుస్తోంది.

ఉగాది రోజు. ఫ్యామిలీలోనే గడపాలని ఇంట్లోనే ఉండిపోయాను. పండుగ సందడితో ఇల్లు కళకళలాడి పోతోంది.

"స్రవంతి ఉందాండి?" అన్నమాట వినపడగానే గేటు వైపు చూశాను. ఎవరో అనుకుంటూంటే "హల్లో మధు, వెల్‌కమ్ వెల్‌కమ్" స్రవంతి పరుగెత్తుకెళ్ళి చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకొచ్చింది.

"నాన్నా, ఇతను మధు. ఇంజనీరింగ్ కలిసి చదివాం. నన్ను అతను ఇష్టపడ్డాడు. అతనంటే నాకూ ఎంతో ఇష్టం, ఇప్పుడు అమ్మ, మీరూ ఒప్పుకుంటే ఎంతో ఇష్టంగా పెళ్ళి చేసుకుంటాం" సూటిగా ఉన్న విషయం చెప్పింది స్రవంతి.

ఎంత వేగంగా ఆలోచించింది. ఆశ్చర్యపోతోంది మనసు.

"స్రవంతి, మధు ఇద్దరిని చూస్తుంటే ఎంతో ముచ్చటగా ఉంది కదండి" రాత్రి భోజనాలయ్యాక మా ఆవిడ నా పక్కన కూర్చుంటూ అంది. మా అమ్మాయి పెళ్ళి విషయం మాట్లాడటానికి మొదటి మాట.

"అవును, ఈడూ జోడూ బాగానే కలిసింది" నేను అనుకుంటున్న మాటగా చెప్పాను.

"మధుని ప్రేమించానని స్రవంతి నాతో చెప్పినపుడు ఒక మంచి రోజున మనింటికి పిలవమని చెప్పాను. సందర్భం కలిసొచ్చేటట్లు ఈ ఉగాది రోజు అతన్ని మనకి పరిచయం చేసింది. ఇద్దరూ ఇంజనీర్లే కాబట్టి కలిసి సంపాదించుకుంటారు.. కదూ" నా అభిప్రాయం తెలుసుకోదలచి అలా మాట్లాడింది.

## కాసిని నానీలు

ఇరవై నాలుగక్షరాల్లో
ఇనరశ్మిని దట్టించు
'నానీ' ఐ పేల్తుంది

ప్రియుడిపై తమకం / నక్షత్రాల్లో కన్పిస్తున్నది
గోరింట బాగా పండింది

కవిత్వం వాడికో ఆయుధం
దాంతోనే వాడు / జనాల ప్రాణాలు తీస్తుంటాడు

బాలల ఉత్సవానికి / మంత్రి కోసం నిరీక్షణ
ఎండలో శోషిల్లి బాలలు

మొన్న ప్రేమగా చూసిన బాలుడు
నేడు ఈర్ష్యగా చూస్తున్నాడు
బాల్యం పోయింది

నింగిమగ్గం ఆసులో / కండె-సూరీడు
తూర్పుపడమరలకు తిరుగుతూ

గాంధీ అంటే వాడికి ఇష్టం
గాంధీ బొమ్మన్న నోట్ల కోసం
ఏమైనా చేస్తాడు

**-సిహెచ్. వి. బృందావనరావు**

"అవును. ఈ సంబంధం కుదిరితే బాగానే ఉంటుంది." నా మాట పూర్తికాకుండా మధ్యలోనే "భలేవారే, మనం అనుమానపడక్కర్లేదు. అమ్మాయి స్రవంతిని వాళ్ళు కూడా ఇష్టపడుతున్నారని తెలిసింది."

ఎంతో సమయస్ఫూర్తితో మాట్లాడుతున్న సుచరితను ఆశ్చర్యంతో చూస్తున్నాను.

"ఉగాది రోజున కలిసినవాళ్ళు ఎప్పుడూ కలిసే ఉంటారు" మా ఆవిడ నమ్మకంలో సాంప్రదాయ బలం స్పష్టమవుతోంది. పైగా ఈ సంబంధం తనకి నచ్చిందనే ఆంతర్యం, ఈ పెళ్ళి జరిపించటం సమంజసం అనే అంతరార్థం అర్థమయ్యేలా మాట్లాడింది.

కలిసొచ్చిన కాలంలో నిన్నే వెతుక్కుంటూ వచ్చిన సంబంధం, అవకాశాన్ని వదులుకోకు వివేకం హితవు పలుకుతోంది. "నిజమే కాని అందుకు నాకు స్థోమత ఉండాలిగా" మనసులో మరోపక్క భయం.

"బాగానే ఉంది వరస. మరో సంబంధం చేసినా జరిగేది ఇదేగా." అంతరాత్మ మందలించింది.

"ఏమిటి హఠాత్తుగా ఆలోచనల్లో పడ్డారు" సుచరిత మాటలు విని నన్ను నేనే సర్దుకున్నాను. "మన స్రవంతి పెళ్ళి గురించే ఆలోచిస్తున్నాను."

నా మాటలకు జవాబుగా "చూడండి ఆడ పిల్లకి పెళ్ళిచెయ్యాలి. తప్పదు. మన అమ్మాయికి నచ్చిన వాడితో పెళ్ళి జరిపిస్తే ఆడపిల్లని సుఖపెట్టినట్టుగా సంతోషపడొచ్చు" సుచరిత మాటల్లో నిజం కాదనటానికి వీల్లేదు.

సంప్రదాయం కోసం పెళ్ళి చూపులు. అటు తరువాత నిశ్చయ తాంబూలాలు చక చక జరిగిపోయాయి.

సుచరిత ఒక్కగానొక్క కూతురు. పెళ్ళి ఘనంగా జరిపించాను.

పెళ్ళి జరిగిన తరువాత ఒక నెల గడిచింది. అమ్మాయికి, అల్లుడికి అదృష్టం వాళ్ళ వెనకనే ఉందన్నట్టుగా ఇద్దరికీ ఫారిన్లో ఉద్యోగాలొచ్చాయి.

ఇటు మా ఇంట్లోనూ, అటు వాళ్ళింట్లోను అంతులేని సంతోషం. మా రెండు కుటుంబాల మధ్య బాంధవ్యం మరింత బలపడింది. అటూ ఇటూ రాకపోకలు, ఆప్యాయంగా పలకరింపులు! ఉత్సాహం! ఎటుచూసినా ఉత్సాహం.

మా అమ్మాయి స్రవంతి భర్తతో విదేశాలకు వెళ్ళిపోయింది.

"శ్రీరామ్‌గారూ, అదృష్టదేవత మీ ఇంట్లోనే కొలువు తీరిందండి. నిజమైన జీవితమంటే మీదేనండి"

ఆఫీసులో ప్రతీ ఒక్కరూ నన్ను అభినందిస్తున్నారు.

నేను ఎలా ఉన్నా ఎలా బ్రతికినా నా పిల్లలకి వాళ్ళు కోరుకున్న జీవితాన్ని ఇవ్వగలిగాను. ఈ తృప్తి చాలు. పరవశిస్తోంది నాలోని తండ్రి హృదయం.

నా జీవితం ఒక అద్భుతం. నా పిల్లల జీవితం నిత్య వసంతం.

రాత్రి పదిగంటలు. నిశ్శబ్దమైన వాతావరణం. అలవాటు ప్రకారం డైరీ వ్రాసుకోటానికి టేబులు ముందు కూర్చున్నాను.

అనుభవాలు – జ్ఞాపకాలు, అనుభూతులు.

ఇవన్నీ కలగలపు జీవితం. జీవితాన్ని ఆలోచనలతో గడపటం కంటే గడిచిన జీవితాన్ని అక్షర రూపంలో దిద్దుకోవటంలో ఆనందం ఉంది. గడపవలసిన జీవితం పట్ల అవగాహన కలుగుతుంది.

రిటైర్‌మెంట్ దగ్గర పడుతోంది. అటు తరువాత... వ్రాస్తున్న పెన్నుని హఠాత్తుగా నాలో కలిగిన ఆలోచన ఆపేసింది. ఆలోచిస్తూ ఉండిపోయాను. ఎవరినైతే నా వాళ్ళు అనుకుని అహర్నిశలు వాళ్ళ కోసమే శ్రమించానో వాళ్ళలో ఏదో మార్పు కనిపిస్తోంది. ఎందుకు, ఏమిటని పదే పదే ఆలోచిస్తున్నా అర్థం స్ఫురించటంలేదు.

మళ్ళీ ఆలోచించాను. ఈ మధ్య కాలంలో జరిగిన సంఘటనల జ్ఞాపకాలు. ఆరు నెలల క్రిందట అనూప్ పెళ్ళి చేసుకున్నాడు. ఉద్యోగం పెద్దది కావటం వలన ఆఫీసు వాళ్ళిచ్చిన బంగళాలోకి మారాడు. "అమ్మా నేను ఉండబోయే ఇల్లు ఆఫీసు వాళ్ళది. నేను మా ఆవిడ తప్పనిసరిగా అక్కడే ఉండాలి. నువ్వు, నాన్నగారు ఉంటున్నది స్వంత ఇల్లు. మీరిద్దరూ హాయిగా ఉండొచ్చు" అనూప్ మాటల్లో లౌక్యం.

"ఒరేయ్ అక్క పెళ్ళి కోసం ఈ ఇల్లు అమ్మేశాం. ఇక మనమందరం కలిసి ఒకచోటే ఉండాలి" నా మనసులోని మాట సుచరిత చెప్పేసింది.

"నాతో చెప్పకుండా ఎంత పొరపాటు చేశారు" మమ్మల్ని వాడు కోప్పడ్డాడు.

బాధ్యత ఉండవలసిన కొడుకు మనసులో కోపం. చివుక్కుమంది మనసు. మరో దారి లేకపోవటంతో మమ్మల్ని తనతో ఉంచుకోవటానికి ఒప్పుకున్నాడు. కాదు, సుచరిత ఒప్పించింది.

విదేశాల్లో స్థిరపడ్డ మా అమ్మాయి స్రవంతి ఫోను చేసింది. "ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నాం, ఎంతో ఇబ్బందిగా ఉంది. అమ్మని పంపించు. సాయంగా ఉంటుంది"

"అదృష్టమంటే నీదే, విదేశాలకెళ్ళే అవకాశ మొచ్చింది" కొడుకు మాటలకి సంతోషంగా ఒప్పు కుంది. సుచరిత వెళ్ళిపోయింది.

ఇన్నాళ్ళు, ఇన్నేళ్ళు ప్రేమతో గడిపిన అర్ధశరీరం పావురంలా ఎగిరిపోయింది. పిడికిలంత గుండెలో కొండంత ఒంటరితనం. పైగా ఎంతో వెలితి.

జ్ఞాపకాలతో బరువైన నిట్టూర్పులు. మరో విషయం ప్రస్తుతం నాకు తృప్తినిచ్చేది కళ్ళెదురుగా కనిపించింది. అంతే, ఉత్సాహంతో మళ్ళీ వ్రాయటం మొదలెట్టాను. ఉదయం తొమ్మిది గంటలు. ప్రతిరోజూ నేను ఈ టైముకోసం ఎదురు చూస్తుంటాను. అబ్బాయి, నేను ఆఫీసుకెళ్ళే టైము. నేను సైకిలు తుడుచుకుంటున్నాను. గేటు దగ్గిర అనూప్ కోసం ఆఫీసు కారు రెడీగా ఉంది. నీట్‌గా డ్రెస్ చేసుకుని చేతిలో పేపరుతో కారెక్కడానికి వెళుతున్న కొడుకుని చూస్తూ నిలబడ్డాను.

కొడుకులో ఉట్టిపడుతున్న హోదా, నడకలో దర్జా, ఎన్నిసార్లు చూసినా మళ్ళీ మళ్ళీ చూడాలనిపి

## రంగవల్లి

ఆకాశం నీలి చీర కట్టుకుని
ప్రకృతి పచ్చచీర కట్టుకుని
ముద్దబంతి పసుపు చీర
కట్టుకుని
సంక్రాంతికి స్వాగతం
అంబరమంటే సంబరంతో
వేకువనే లేచింది ఓ
కన్నె కుసుమం
పసుపు చీర కట్టిన ముద్దబంతి
కురులు మెరుస్తూంటే
పసిమిరంగు పల్లె పడుచు
పట్టులంగా పావడాతో
ముద్దులొలుకుతూ ఒద్దికగా
కూర్చుంది
ఆరుబయట మంచు పీటపై
అరచేత ముగ్గుగిన్నె
కళ్ళల్లో కోటివన్నె
రంగు రంగుల రంగవల్లి
రతనాల ముగ్గులు వెదజల్లి!

–టి. అమూల్య

స్తుంటుంది. కారెక్కుతూ వాడు కూడా నన్ను చూశాడు. కారెక్కి విండో గ్లాస్ మూసేశాడు. హఠాత్తుగా కంట్లో నీటిపొర.

"నాన్నా మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి" అంటూ వచ్చిన మా అబ్బాయిని చూసి వ్రాయటం ఆపేశాను.

"నాన్నా మీరు ఉద్యోగం మానెయ్యండి. రోజూ సైకిలు మీద వెళ్ళి ఆ గుమాస్తా ఉద్యోగం చెయ్యకపోతే వచ్చే నష్టమేమీ లేదు. అందులోనూ నేను కారులో.. మీరు సైకిల్ మీద... ఛీఛీ... నాకెంతో చిన్నతనంగా ఉంది" చిరాకుపడుతూ వెళ్ళిపోయాడు.

"గుమాస్తాగా ఈ సైకిలు తొక్కటం వల్లనేగా తను ఆఫీసరైంది. అసలు విషయం మర్చిపోయాడా" గాయ పడిన హృదయం అరవబోయింది. నిగ్రహించు కున్నాను.

ఎంతో స్వేచ్ఛతో పెరిగిన కొడుకు, ఆ తండ్రినే శాసించటం.. నివ్వెరపోతోంది మనసు. ఏమిటిది? ప్రయోజకుడైన కొడుకుని చూసుకోవటం ఒక తండ్రిగా తనదైన హక్కు. మరి తన కొడుకు వ్యతిరేకిస్తున్నాడా?

మరి ఇన్నాళ్ళుగా ఎంతగానో ఎదురు చూసిన క్షణం "తన రక్తం తననే అసహ్యించుకోవటానికా? అనుకోని సంగతి, అంతే కాదు ఎవరికీ ఎదురవ్వని స్థితి. కన్న కొడుకు మొహంలోని అసహ్యం, మాటల్లో అయి ష్టత... వద్దనుకుంటున్నా కళ్ళముందే ఉంటూ రెప్పలకు అడ్డుపడుతున్నాయి. ఒక్క ఆవలింతకు కూడా నోచుకోని రాత్రి. నిశ్శబ్దం. చెదిరిన గుండె చప్పుడు చెవుల్లో చేస్తున్న రొద.

హఠాత్తుగా ఎవరివో మాటలు. ఒద్దనుకుంటున్నా వినపడుతున్నాయి.

"మీరు మీ నాన్నగారితో ప్రవర్తించిన విధానం..." కోడలు వసుధ మాటలు.

"సరిగ్గానే ఉంది. ఆఫీసుకు వెళ్ళేటప్పుడు ప్రతిరోజూ తనూ, తన పాత సైకిలుతో కావాలనే కనిపించటం... అపశకునం కాకపోతే మరేమిటి?" కొడుకు మాటలు.

"తండ్రి ఉనికి కొడుకుకి అపశకునమా?' కొడుకు మూర్ఖత్వానికి పరాకాష్ట.

"చూడండి, మిమ్మల్ని పెంచి, చదివించి ఇంత వారిని చేసిన..." వసుధ మాటలు .

"కన్న తండ్రిగా అది ఆయన బాధ్యత. అందులో ఆయన గొప్పతనం ఏమిటి?" అంటే వాళ్ళ కోసం ప్రత్యేకించి చేసినవీ... కొడుకులో నిర్లక్ష్యాన్ని సహించలేక క్షోభిస్తున్న హృదయం.

"ఆ ముసలాయన్ని ఇంట్లో కూర్చోపెట్టటం..." భార్య మాటలని మధ్యలోనే ఆపి

"ఊరికే కూర్చోపెట్టటంలేదు. కొన్నాళ్ళు మనింట్లో పనులు చేస్తాడు. మరి కొన్నాళ్ళలో మన ఇంటి కన్‌స్ట్రక్షన్ మొదలవుతోంది. అక్కడ కాపలా ఉంటాడు."

"అంటే తను... ఊహించలేని పరిస్థితి! ఇన్నేళ్ళు తను రెక్కలు ముక్కలు చేసుకున్నది చివరికి కొడుకింట్లో ఊడిగం చేయడానికా? వాడి పెత్తనం కింద బ్రతక టానికా?

ఆపుకోలేని ఆవేశంతో వ్యక్తిత్వం ఊగిపోతోంది.

"మా అమ్మ విషయంలో ఏం చేశాను. విదేశాల్లో ఎవరి పనులు వాళ్ళే చేసుకోవాలి. మా అక్క, బావా ఉద్యోగస్థులు కనుక, వాళ్ళింట్లో చాకిరి చెయ్యటానికి ఇక్కడినుంచి పంపించేశాను." ఇందుకా నా పిల్లలిద్దరిని ఎంతో అపురూపంగా పెంచింది.

పిల్లల్లోని స్వార్థాన్ని తట్టుకోలేక ఆక్రోశిస్తున్న తండ్రిగా మిగిలిపోవటానికా?

"మిత్రమా, ఒక్క చిన్నమాట..." ఎవరో.. అను కున్నాను! నాలో ఉన్న మరో మనిషి.

"నీకు ధర్మంగా అనిపించినవి నీ పిల్లలకు న్యాయంగా లేవు. నువ్వు న్యాయమని అనిపించిన వాటిల్లో నీ సంతానానికి ధర్మం కాదు. ఇదీ ఈ కాలం పరిస్థితి. ఒక ఆశయంతో పెంచావు. ఒక అవసరంతో వాళ్ళు పెరిగారు. ఇది ప్రస్తుతం వాళ్ళ తీరు."

అచేతనంగా ఉండిపోయాను. నా లోపలి మనిషి మాట్లాడుతూనే ఉన్నాడు.

"ఇటువంటి స్థితి స్వయంగా నువ్వు కల్పించు కున్నావు. నీ కుటుంబాన్ని ఉద్ధరించాలనుకుని నీ సంగతి నువ్వే పట్టించుకోలేదు. వాళ్ళ దారిలో పూలు పరిచే తపన, తాపత్రయంలో నీ దారిలోని ముళ్ళని ఏరి పారెయ్యటం మర్చిపోయావు. ప్రస్తుతం నీ వృద్ధాప్యానికి ఆ ముళ్ళే గుచ్చుకుంటున్నాయి. ఆ విషయం గ్రహించు. అనాదరణకు గురయిపోతున్నానని నీ పిల్లల్ని తప్పు పట్టటం నీ తెలివి తక్కువ.

ప్రతీ వ్యక్తికి వృద్ధాప్యం రేపటి బాల్యం. అందుకు ఎవరికి వారే చేయూతనిచ్చుకోవాలి. మనం ఆలోచించి నట్టుగా మన పిల్లలు ఆలోచించరు.

నా లోపలి మనిషి మాటల్లో నిజం, నేటి సామాజిక నైజం! ■